క్లుప్తంగా

తూకంలో తేడాలపై 11 కేసులు నమోదు



నెహ్రూనగర్: తూకంలో తేడాలు వస్తే సహించేది లేదని, మోసాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ జి. కొండారెడ్డి తెలిపారు. డెప్యూటీ కంట్రోలర్ షాలేంరాజు ఆదేశాల మేరకు ఆదివారం జేకేసీ కాలేజీ రోడ్డులోని చేపల, చికెన్, మటన్ షాపుల్లో తనిఖీలు చేపట్టారు. మొత్తం 20 షాపుల్లో తనిఖీలు చేపట్టగా 11 షాపుల్లో తూకంలో కేజీకి 200 నుంచి 400 గ్రాముల వరకు తేడాలున్నట్లు గమనించారు. సదరు కాటాలను సీజ్ చేసి వారిపై కేసులు నమోదు చేశారు. తూకంలో తేడాలున్నట్లు వినియోగదారులు గమనిస్తే 0863-2223202 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ సునీల్ రాజు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ



నెహ్రూనగర్: పేద ప్రజల ఆరోగ్యానికి సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కొండంత భరోసా కల్పిస్తున్నారని 30వ డివిజన్ కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఆరోగ్య శ్రీ పథకం కింద రూ.25 లక్షలు వరకు వైద్య ఖర్చును భరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఆరోగ్య శ్రీ కార్డులను డివిజన్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5లక్షల పరిమితి ఉన్న ఆరోగ్యశ్రీ కార్డును రూ.25లక్షలు వరకు పెంచుతూ సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రతి పేదవాడికీ కార్పొరేట్ ఆసుపత్రుల్లో సైతం మెరుగైన వైద్యం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ లక్ష్మణస్వామి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేఎల్‌యూ విద్యార్థినికి గన్ ఫైరింగ్‌లో పురస్కారం



తాడేపల్లిరూరల్ : 10వ ఆంధ్రా బాలికల ఎన్‌సీసీ బెటాలిన్ ఎనిమిదో సామూహిక వార్షిక శిక్షణశిబిరంలో కేఎల్‌యూకు చెందిన విద్యార్థినులు పలు పురస్కారాలు సాధించినట్లు 10వ ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్ లెఫ్టినెంట్ పావని ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వ విద్యాలయంలో బీఏ ఎల్ఎల్‌బీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జె.షణ్ముఖి గన్ ఫైరింగ్‌లో ద్వితీయ బహుమతి సాధించిందని తెలిపారు. ఆమె నృత్య ప్రదర్శనలోనూ బంగారు బహుమతి సాధించిందని వెల్లడించారు. పేరేచర్ల షార్ట్ రేంజ్‌లో నిర్వహించిన 0.22 గన్ ఫైరింగ్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు అత్యుత్తమ క్యాడెట్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. పాటలు పాడడం, క్యాంప్ నిర్వహణ వంటి పలు రకాల సాంస్కృతిక పోటీలలో కేఎల్‌యూ విద్యార్థినులు నవ్య, కల్పన, మైత్రి పురస్కారాలను సాధించగా, ప్రెట్టో రాథోర్ ఉత్తమ క్యాడెట్‌గా పురస్కారం అందుకున్నారని పావని వివరించారు. క్యాంప్ కమాండెంట్ ఎస్.వి.ఎస్. సుదర్శన్ చేతుల మీదుగా ఆయా విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిన క్యాడెట్లకు పురస్కారాలు అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్. హనుమంతరావు, లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పవన్‌కుమార్‌లు పురస్కారాలు సాధించిన విద్యార్థినులను అభినందించారు.

ఉత్సాహంగా దేశభక్తి గీతాల పోటీలు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం శ్రీ పద్మావతి కల్యాణ మండపం వేదికగా ఆదివారం సంస్కార భారతి అధ్యక్షుడు ఇండ్ల శ్రీధరబాబు ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే పురస్కరించుకుని భరతమాత పూజా దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, సంస్కారభారతి కార్యవర్గం జ్యోతి ప్రకాశనం చేసి కార్యక్రమాల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వందేమాతరం పూర్తి గీతం రాత, సంస్కృతం, హిందీ దేశ భక్తి గీతాల పోటీలు, కళాకృతులు తయారీ పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు.

కుటుంబ సభ్యురాలిలా అండగా ఉంటా !

- మంత్రి విడదల రజిని
- పశ్చిమ నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయం
- సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండా
- వేడుకగా కొనసాగుతున్న 'మనతో మన రజినమ్మ'
- హాజరైన శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రజని. వేదికపై ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం తదితరులు

నెహ్రూనగర్: పశ్చిమ నియోజకవర్గ ప్రజలతోనే తన ప్రయాణం కొనసాగుతుందని, ఇక్కడి ప్రజలకు కుటుంబసభ్యురాలిగా ఎప్పుడూ అందుబాటులో ఉంటానని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గం 31వ డివిజన్ బోరింగు పంపు సెంటర్‌లో ఆదివారం 'మనతో.. మన రజినమ్మ' కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి రజిని మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ గెలుపు.. జనం గెలుపు అని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశాన్ని జగనన్న తనకు ఇచ్చారని, ఇది అదృష్టంగా భావిస్తున్నానని పేరొకన్నారు. ఇక్కడి ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా ముందుకు సాగుతానని చెప్పారు. గుంటూరు నగరాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని పేర్కొన్నారు. నగరం విద్య, వైద్యం రంగాల్లో ఎంతో అభివృద్ధి చెందిందని, దీన్ని మరింతగా ముందుకు తీసుకు వెళతానని స్పష్టం చేశారు.

టీడీపీ మాయమాటలు నమ్మొద్దు

ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ టీడీపీ నాయకులు మాయమాటలు చెప్పి ప్రజల్ని మభ్యపెట్టాలని చూస్తారని.. వారి మాయ మాటలను వినే పరిస్థితుల్లో ప్రజలు లేరని మంత్రి స్పష్టం చేశారు. 2014 ఎన్నికల్లో విజయం సాధించాక టీడీపీ గుంటూరు నగరాన్ని తవ్వేసిందని మండిపడ్డారు. ఎక్కడికక్కడ రోడ్లు పగలగొట్టి ప్రజల సహనాన్ని పరీక్షించారని దుయ్యబట్టారు. గుంటూరు నగరాన్ని దోచుకున్నారని ధ్వజమెత్తారు. మళ్లీ కపట విన్యాసాలతో ఓట్ల కోసం వస్తారని, ప్రజలు వీరిని నమ్మడానికి సిద్ధంగా లేరని స్పష్టం చేశారు. గుంటూరు నగరం అభివృద్ధికి గొప్ప ప్రణాళిక రూపొందిస్తున్నామని, దాని అమలు ధ్యేయంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభివృద్ధే ధ్యేయంగా జగనన్న పరిపాలన కొనసాగుతోందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆయనకు ప్రజలు పట్టం కట్టబోతున్నారని తెలిపారు.

- స్థానిక ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ప్రజలందరికీ ఎంతో మేలు జరిగిందని చెప్పారు.
- ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ టీడీపీ అధికారంలో కోసం ఎన్నో కుయుక్తులు పన్నుతుందని, ప్రజలు వాటిని నమ్మే పరిస్థితులు లేవని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.
- గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిశీలకులు రాతంశెట్టి సీతారామాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందాలంటే సంక్షేమ సారథి సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అందుగుల సంతోష్, కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, క్లస్టర్లు, మండల ఇన్‌చార్జిలు, అనుబంధ విభాగాల నాయకులు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

26న ట్రాక్టర్ ర్యాలీ జయప్రదం చేయాలి

పాత గుంటూరు: రైతు, కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం వైఖరికి నిరసనగా జనవరి 26వ తేదీన నిర్వహిస్తున్న ట్రాక్టర్, మోటార్ సైకిల్ ర్యాలీని జిల్లాలో జయప్రదం చేయాలని అఖిల భారత రైతు, కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. బ్రాడీపేటలోని పి.ఎల్.రావు భవనంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం దొడ్డిదారిలో వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్ప చెప్పేందుకు రకరకాల చట్టాలు తీసుకొచ్చి వ్యవసాయాన్ని దివాలా తీయిస్తోందని విమర్శించారు. కార్మికులకు నష్టాన్ని కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకువచ్చి వారి హక్కులు హరిస్తోందని తెలిపారు. దేశంలో 5 లక్షల పైగా కంపెనీలు మూతపడేలా చేశారని, కేంద్ర బడ్జెట్లో ఉపాధి హామీ పథకాన్ని కుదించారని పేర్కొన్నారు.ఆహార భద్రత చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సమావేశంలో ఏఐకేఎస్ జిల్లా నాయకులు పచ్చల శివాజీ, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు కళ్లం రాజశేఖర్ రెడ్డి, జాతీయ రైతు కూలీ సంఘం నాయకులు వేల్పూరి నరసింహారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, కిసాన్ ఫెడరేషన్ నాయకుడు శ్రీధర్‌రావు, రాష్ట్ర రైతు కూలీ సంఘం నాయకుడు యు. గనిరాజు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి పాల్గొన్నారు.

గురుభక్తిని చాటిన పూర్వ విద్యార్థులు



గురువు రామమోహన్‌రావును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు



మాజేటి గురవయ్య హైస్కూలులో నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య ఉన్నత పాఠశాలలో 1969–74 మధ్య ఆరో తరగతి నుంచి టెన్త్ వరకు విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఎస్వీఎన్ కాలనీలోని ఓ హోటల్లో సమావేశమయ్యారు. 50 ఏళ్ల కలయికకు గుర్తుగా పంచాశత్ స్వర్ణోత్సవంగా కలుసుకున్న పూర్వ విద్యార్థులు గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులుగా గడిపిన మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. హైస్కూల్ విద్యను పూర్తి చేసుకున్న తమ బ్యాచ్ స్వర్ణోత్సవం పూర్తి చేసుకున్న సందర్భంగా భావోద్వేగాలను పంచుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పూర్వ విద్యార్థి సహచరులను కలుసుకున్న ఆనందంలో భావోద్వేగానికి లోనయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని నాటి స్నేహబంధాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను ఒక చోటకు చేర్చిన కార్యక్రమ రూపశిల్పి, జనచైతన్య హౌసింగ్ డైరెక్టర్ మాదల రత్నగిరి బాబు మాట్లాడుతూ తమ గురుదేవులు నేర్పిన విద్యాబుద్ధులతో వైద్యులు, ఇంజనీర్లు, న్యాయవాదులు, వ్యాపారవేత్తలు, బ్యాంకర్లుగా వివిధ హోదాల్లో పని చేసే కుటుంబాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకున్నామని తెలియజేశారు. గురుదేవులు గద్దిపాటి రామమోహన్‌రావు, కొరటాల ఇందిరాదేవి దంపతులు, గింజుపల్లి వరప్రసాదరావు, మండదపు పున్నయ్యలను పూలమాలలు, నూతన వస్త్రాలు జ్ఞాపికలతో సత్కరించి, గురుపాద పూజ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు కోట బుల్లి కుమార్, చెన్నుపాటి వెంకటేశ్వరరావు, థామస్ చౌదరి, కావూరి ఈశ్వర చంద్ర పాల్గొన్నారు.

మాజేటి గురవయ్య హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: బ్రాడీపేటలోని శ్రీమాజేటి గురవయ్య హైస్కూల్లో 1971–76 మధ్య హైస్కూల్ విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి 45 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. హైదరాబాద్‌కు చెందిన మోహన్స్ డయాబెటిక్ డైరెక్టర్ డాక్టర్ గణపతిశాస్త్రి, విశ్రాంత సంయుక్త కార్మికశాఖ కమిషనర్ మల్లేశ్వరకుమార్, ఇంజినీర్లు అచ్యుతుని శ్రీనివాస్, బ్యాడిగార వెంకటకృష్ణ, బ్యాంక్ మేనేజర్ రామకృష్ణ, పెప్సీ కంపెనీ జనరల్ మేనేజర్, అంతర్జాతీయ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు రాంబాబు పాల్గొన్నారు. సమావేశంలో భాగంగా పాఠశాల పాలకవర్గ పూర్వ కార్యదర్శి మాజేటి వీఆర్‌కే ముత్యాలు, ప్రస్తుత కార్యదర్శి మాజేటి రాంబాబును సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఏటా పూర్వ విద్యార్థుల సమావేశాలను నిర్వహించాలని తీర్మానించారు.

రజకుల సమస్యలపై పెద్దన్న అలుపెరుగని పోరాటం



సంతాప సభలో మాట్లాడుతున్న జూపూడి శ్రీనివాసరావు

నెహ్రూనగర్: రజకుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసిన పోరాట యోధుడు సి. పెద్దన్న అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. రజక జన సేవా సంఘం మాజీ అధ్యక్షుడు పెద్దన్న సంతాప సభ ఆదివారం కాకుమానువారితోటలోని యానాదికాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రానికి రెండుసార్లు అధ్యక్షుడిగా ఎన్నికైన పెద్దన్న రజకుల సమస్యలపై నిత్యం పోరాడేవారని గుర్తు చేశారు. ఆయన ఆలోచన విధానాలకు అనుగుణంగా రజక జాతి ముందుకు సాగాలని చెప్పారు. కార్యక్రమంలో బహుజన మహాసభ సెంట్రల్ కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్ సింగ్, రైతు కూలీ సంఘం నాయకులు నాదెండ్ల బ్రహ్మయ్య, పి. కోటేశ్వరరావు, ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, రవికుమార్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేత



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేస్తున్న బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ

బజరంగ్ ఫౌండేషన్ చేయూత

చేబ్రోలు: నిరుపేదలైన ఇద్దరు దివ్యాంగులకు బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్రై సైకిళ్లను ఆదివారం అందజేశారు. జగన్నామ సంక్షేమ సంగమం కార్యక్రమంలో భాగంగా ఇటీవల బజరంగ్ ఫౌండేషన్ నారాకోడూరు గ్రామంలో నేత్ర జ్యోతి, మీ గుండె పదిలం, దివ్యాంగ దర్శిని తదితర కార్యక్రమాలను నిర్వహించింది. గ్రామానికి చెందిన ఇద్దరు దివ్యాంగులు కూచిపూడి అబ్రహం, కారుమూరి సాల్మన్ నడవలేని స్థితిలో పడుతున్న ఇబ్బందులను అంబటి మురళీకృష్ణ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన రెండు ట్రై సైకిళ్లను వారి ఇంటి వద్దకు వెళ్లి అందజేశారు. ఒంటరివాడైన అబ్రహం దైనందిన కార్యక్రమాలకు సహాయం చేసే వారు లేకపోవటంతో వెస్టన్ కమోడ్‌ను ఆయన నివాస ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ఫౌండేషన్ సభ్యులను అంబటి ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను స్ఫూర్తిగా తీసుకుని బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాల పరంపరను కొనసాగిస్తున్నట్లు అంబటి మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన సభ్యులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీరామ పట్టాభిషేకం



సీతారాముల విగ్రహాలకు అభిషేకం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో ఆదివారం రింగ్ రోడ్డులోని మాజేటి రామ్ కల్యాణ మండపంలో శ్రీరామ పట్టాభిషేకాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు పూజలతో పాటు శ్రీసీతారామ, లక్ష్మణ ఆంజనేయ స్వామివారి విగ్రహాలకు అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. లోక కల్యాణం, సమాజహితం కోసం ఇటువంటి ధార్మిక కార్యక్రమాలు అవసరమని పేర్కొన్నారు. ప్రముఖ ప్రవచన కర్త కె.వి. కోటేశ్వరరావు ఆధ్యాత్మిక ప్రసంగంలో శ్రీరామ పట్టాభిషేకాన్ని వివరించారు. బీజేపీ నాయకుడు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా శ్రీరామ పట్టాభిషేకాన్ని నిర్వహించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. పూజల్లో 600 మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖర్ రావు, కార్పొరేటర్ కొత్తూరి వెంకట్, అవోపా అధ్యక్షుడు కె.వి.బ్రహ్మం, మహిళా విభాగ అధ్యక్షురాలు నిర్మల, వెచ్చా రాధాకృష్ణయ్య, మహంకాళి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా పునీత ఆగ్నేసమ్మ వేడుకలు



మేడికొండూరు: స్థానిక పేరేచర్ల ఆర్‌సీయం చర్చిలో పునీత ఆగ్నేసమ్మ అమ్మవారి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకలలో భాగంగా పలు కార్యక్రమాలు జరిగాయి. ముఖ్య అతిథిగా గుంటూరు జిల్లా పీఠాధిపతులు చిన్నాబత్తుని భాగ్యయ్య హాజరై దివ్యపూజా బలి నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే, తాడికొండ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకతోటి సుచరిత పాల్గొని పునీత ఆగ్నేసమ్మ ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని, ప్రతి ఒక్కరూ ప్రేమతో ప్రార్థన చేసుకుని జీవితం సుఖమయం చేసుకోవాలని సూచించారు. వేడుకలలో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. పలువురు దివ్యపూజా బలిలో పాల్గొని పునీత ఆగ్నేసమ్మ అమ్మవారి పవిత్రత గురించి భక్తులకు చాటి చెప్పారు. వేడుకల్లో ఎంపీపీ మన్నవ స్వప్న రాజేష్, గుంటూరు రూరల్ మండలం జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, ముత్యాల బాలస్వామి, గద్దం రాంబాబు, జంధ్రాసుపల్లి నాగేశ్వరరావు తదితరులు హాజరై పునీత ఆగ్నేసమ్మ అమ్మవారి ఆశీర్వచనాలు పొందారు.

వేమన పద్యం తెలుగు వారి సొంతం



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల వి.ఎస్.ప్రసాద్

లక్ష్మీపురం: తెలుగు వారు గర్వించదగ్గ గొప్ప సామాజిక కవి వేమన అని సాహితీవేత్త ముప్పాళ్ల వి.ఎస్.ప్రసాద్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన ఆధ్వర్యంలో ప్రజాకవి వేమన జయంతిని ఆదివారం నిర్వహించారు. సాహితీవేత్తలు, కవులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ళ వి.ఎస్. ప్రసాదరావు మాట్లాడుతూ సమాజంలో మూఢనమ్మకాలు, విగ్రహారాధన, సామాజిక అంతరాలను వేమన ఖండించారన్నారు. రచయిత్రి ఏ.వి.కె. సుజాత మాట్లాడుతూ 19వ శతాబ్దం మొదటి భాగంలో బ్రిటిష్ అధికారి సి.పి.బ్రౌన్ వేమన పద్యాలు సేకరించి పుస్తక రూపంలో తెచ్చి, ఆయన గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజేశారన్నారు. కవి జమదగ్ని మాట్లాడుతూ మానవులంతా ఒకటే అన్న సత్యాన్ని వేమన చాటి చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి, విద్యావేత్త ఈ.చంద్రయ్య, కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

26న యూత్ రిట్రీట్

నెహ్రూనగర్: తెలుగు బాప్టిస్ట్ సంఘం ఆధ్వర్యంలో 26న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు యూత్ రిట్రీట్ (యవ్వనస్తుల కూడిక) నిర్వహించనున్నట్లు సెక్రటరీ వై. సోమయ్య, యూత్ డైరెక్టర్ బి. ప్రతాప్ ఆదివారం తెలిపారు. కన్నావారితోట మూడు బొమ్మల సెంటర్ వద్ద గల చర్చిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా చర్చిలో యువతకు యోహాను సువార్త మీద గ్రూప్ క్విజ్, నెహెమ్యా గ్రంథం మీద వ్యక్తిగత బైబిల్ పరీక్ష, పాటల పోటీ నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. ముఖ్య ప్రసంగీకులుగా కావలికి చెందిన కల్వరీ తెలుగు బాప్టిస్ట్ చర్చి నుంచి బ్రదర్ సీహెచ్. జీవన్ హాజరవుతారని తెలిపారు. యువత హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

మహాకాళేశ్వరుడికి పంచగవ్య పూజలు



పంచగవ్య పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామ శివారులో కోటిఒక్క లింగాల ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా రెండోరోజు ఆదివారం వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య పూజ, వాస్తు పూజ, కైలాస మండపారాధన, వాస్తుహోమం, వాస్తుబలి, శాంతి కుంభారాధనను వేదపండితులు కొండవీటి కృష్ణమూర్తి, కె.ఆంజనేయ శర్మ, రామేశ్వర గురుకుల్‌లు నిర్వహించారు. అనంతరం మహాకాళీ, మహా కాళేశ్వర విగ్రహాలకు 11 నదుల నుంచి తీసుకువచ్చిన పవిత్ర జలాలతో అభిషేకాలు చేశారు.కోటి ఒక్కలింగాల ప్రతిష్ఠ పూజల్లో ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకతోటి సుచరిత, మండల నాయకులు పాల్గొన్నారు. సుచరితను అమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు జ్ఞాన ప్రసన్న స్వామి ఆశీర్వదించారు. ఆలయం వెలుపల నిర్వహిస్తున్న పూజా కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, సర్పంచ్ ఎం.శివకుమారి, పార్టీ నాయకులు చిట్టా అంజిరెడ్డి, పి.జేమ్స్ ఇన్నయ్య, కె.చిన్నప్పరెడ్డి, పాలపాటి రఘు, బి.అంజిరెడ్డి, డి. మెల్కియా, చేవూరి రామమోహన్‌రెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి, ఖాజావలి, పి.శ్రీనివాసరెడ్డి, పి.కోటిరెడ్డి, మస్తాన్‌వలి, టి.కృష్ణ, చౌడయ్య, అప్పిరెడ్డి, సంజీవరెడ్డి, కె.బ్రహ్మారెడ్డి, ఎ.శ్రీనివాసరెడ్డి, వి.రాము, భార్గవి, వై.శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి రాధాకృష్ణమూర్తిలు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ బస్సు కిందపడి వ్యక్తి మృతి

గుంటూరు ఈస్ట్: ప్రమాదవశాత్తు బస్సు కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటనపై ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. పల్నాడు బస్టాండు వైపు నుంచి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వైపు మిత్రుని ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చుని సంగడిగుంటకు చెందిన షేక్ అయూఫ్ (50) వెళుతున్నాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. అదే సమయంలో వచ్చిన కర్నూలు బస్సు వెనుక చక్రం అయూఫ్ మీదుగా వెళ్లడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు నగరపాలక సంస్థలో 'స్పందన'

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో జరుగుతుందని కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన ఉంటుందని, స్థానికంగా పరిష్కారం కాని సమస్యలపై తమకు నేరుగా అర్జీలు అందజేయవచ్చని ఆమె సూచించారు.

కోడి పందేల స్థావరాలపై పోలీసుల దాడి

తాడికొండ: తాడికొండ మండలం బండారుపల్లి గ్రామంలో కోడి పందేల స్థావరాలపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడులలో ముగ్గురు వ్యక్తులతో పాటు రూ.1050 నగదు, చనిపోయిన కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు.